# మళ్ళీ జన్మంటూ వుంటే!...

"ఆడదానిగా మాత్రం పుట్టకూడదని కోరుకుంటున్నానే" అంది వేద.

"ఏమిటే! అంత విసిగిపోయావా ఆడబ్రతుకులో" అడిగింది సుభాషిణి.

"ఆ..." అంది అదే స్థాయిలో విసుగు ప్రదర్శిస్తూ వేద.

"ఎందుకే? నీకేం బాధ? హాయిగా మొగుడూ పెళ్ళాలిద్దరూ ఉద్యోగాలు చేసుకుంటున్నారు. కావలసినంత డబ్బూ, హోదా అన్నీ వున్నాయి. ముత్యాల్లాంటి బిడ్డలూ, స్కూటరూ, ఇంకేం కావాలే! నువ్వే అలా అంటే ఇంక నేనేం అనను?" అంది సుభాషిణి.

"నీకేం? మహారాజులా వున్నావు. మీ ఆయన సంపాదించి తెచ్చిందాంట్లో ఏదో తింటారు. పొదుపుగా గుట్టుగా సంసారం చేస్తున్నావు. నేనూ వున్నాను. ఇద్దరం ఆఫీసులకెళ్లి పోవాలి. తెల్లారి లేచింది మొదలు పరుగో పరుగు. పిల్లల్ని తయారుచేసి వాళ్ళకి తినిపించి టిఫిన్ కట్టి స్కూలుకి పంపించాలి. వంట చేసుకోవాలి. ఈ మధ్యలో ఇంటికెవరైనా వస్తే వాళ్లతో మాట్లాడాలి, కాఫీయో, టీయో, ఇంకా దగ్గర వారైతే, టిఫినో పెట్టాలి.

ఇవన్నీ అయ్యేటప్పటికి టైమైపోతుంది ఆఫీసుకి. హడావుడిగా తయారై, ఆఫీసుకి బయలుదేరాలి. ఈలోగా ఎవరైనా బంధువులు దిగారో ఇంతే సంగతులు. సెలవు పారేసీ, మళ్లీ వంటా పెంటా. పోనీ ఆఫీసులకెళ్ళేవాళ్లు కాదా ఇవన్నీ ఎందుకు, మేమెక్కడో తింటాంలే అనరు ఆ బంధువులు కూడా. ముఖ్యంగా భర్త తాలూకు బంధువులైతే మరీను. పైగా కాఫీ కలుపుతే అలవాట్లేదు టీ కావాలనో, టీ ఇస్తే కాఫీ కావాలనో, రెండూ వుంటే వాళ్ళ పిల్లలు, పాలు తప్ప వేరే తాగరనో, బోర్న్‌వీటా కావాలనో ఇలా అడిగేస్తూ వుంటారు. చచ్చినట్టు ఎవరికి ఏంకావాలో చేసి పెట్టాలి. లేకపోతే కోపాలూ తాపాలూనూ" విసుక్కుంటూ కాసిన్ని మంచినీళ్లియ్యవే అంది వేద.

సుభాషిణి మంచి నీళ్లిచ్చింది. తాగి మళ్ళీ చెప్పడం మొదలెట్టింది. అంతేకాదు. భర్త అనే దేవుడు కాస్త అర్థం చేసుకునే రకమైతే సరేసరి. లేకపోతే అడక్క. మావారికి ఆడవాళ్లే పన్లెందుకు చెయ్యాలీ? మొగాళ్లెందుకు చెయ్యకూడదూ? కాస్త మొగాడుకూడా ఆడవాళ్ళకి పనుల్లో సాయపడితే తప్పా? ఇలాంటి విషయాలు చదవడానికి కూడా ఇష్టపడరు. ఆయన కాఫీ తాగిన కప్పుని ఎక్కడుంటే అక్కడే వొదిలేస్తే నేను తీసికెళ్లి మోరీలో వెయ్యాల్సిందే కానీ, తను తీసికెళ్లి కడగడానికి కూడా వెయ్యరు. ఇద్దరం సమానంగా పన్లు చేసేస్తాం కదా. తనలాగే నేనూ అలిసిపోతానని అనుకోరు. రాత్రి భోజనాలై అన్నీ సర్దుకుని పడుకుందాం అని మంచంమీద వాలేసరికి "కాళ్లు పిసుగుదూ, స్కూటర్ తొక్కి తొక్కి నొప్పెడుతున్నాయి" అంటారు. నేను మాత్రం మనిషిని కానూ? ఛీ! ఛీ! వెధవ సమాజం. స్త్రీ పురుషులిద్దరినీ చస్తే సమానంగా చూడలేరు" విసురుగా అంది వేద.

"ధరలు పెరిగిపోతూన్న ఈ రోజుల్లో ఆడా మగా ఇద్దరూ ఉద్యోగాలు చేస్తే తప్ప ఇల్లు గడవదాయే. మరేం చేస్తాం?" అంది జాలిగా సుభాషిణి.

"నా తలకాయ్! సంపాదించేం లాభం? ఆ డబ్బు మీద ఆమెకే అధికారం వుండదు. పతి దేవుల ఆజ్ఞానుసారం ఖర్చుపెట్టాలి. అది ఆయనగారి చెల్లెళ్ల పెళ్లికో, తమ్ముళ్ల చదువుకో కావాలంటే, చచ్చినట్టు ఇచ్చి తీరాల్సిందే. నా చెల్లెలి పెళ్లికి నేనూ సాయం చెయ్యాలి మరి.

"కాస్త నేనూ వెనకేస్తాను" అని అనడానికి లేదాయె! ఎందుకు ఉద్యోగం చెయ్యాలి ఆడవాళ్లు. హాయిగా ఇంట్లో కూర్చుని వంటచేసి పెట్టి, నచ్చినవి తింటూ పిల్లల్ని చూసుకుంటూ, కాలక్షేపం చెయ్యొచ్చుగా! ఎందుకీ బాధ. మధ్యాహ్నం హాయిగా రెస్టు తీసుకోవచ్చు. అప్పుడు రాత్రి ఎంతసేపైనా మేలుకోవచ్చు. మగాడు ఆఫీసు కెళ్లొచ్చి అలిసిపోతే మరి ఆడది అటు ఆఫీసుకీ వెళ్లి, ఇటు ఇంట్లో పన్లు చూసుకుంటూ, పిల్లల పన్లూ వాళ్ల బాగోగులూ చూసుకుంటూ, మళ్లీ వొచ్చేపోయే వాళ్ల అతిథి మర్యాదలు చేసుకుంటూ, ఎంత కష్టపడుతూ వుండాలి. మొగాళ్లకి ఈ విషయంలో కొంచెమైనా కనికరం వుందా?

ఛీ! ఛీ! పైగా అత్తమామలూ ఆడబిడ్డలూ, దెప్పిపొడుపులూ, సాధింపులూను. పైపెచ్చు ఇద్దరూ సంపాదించేసి మహా సుఖపడిపోతున్నారని ఒక అపోహ!" గుక్క తిప్పుకోకుండా వేద చెబుతూన్న మాటల్ని వింది సుభాషిణి.

"నిజమే! వేద చెప్పిన మాటల్లో నిజంలేకపోలేదు" అనుకుంది.

"అంతలోనే పరుగెత్తుకొచ్చాడు వేద కొడుకు కౌశిక్ "అమ్మా! నాన్న నిద్దరలేచేరే! నిన్ను అర్జెంటుగా రమ్మంటున్నారు. ఎవరో ఆఫీసు వాళ్ళొచ్చారట. టిఫిన్ చేసి పెట్టాలిట" అంటూ.

"చూశావా సుభాషిణీ! ఆదివారం నాడు కూడా ఇదే గొడవ. కాస్సేపు కబుర్లు చెప్పుకుని రొటీన్‌లోంచి బయటపడదామని వొచ్చాను. అంతే, అప్పుడే కబురు. ఛీ! ఛీ! మళ్ళీ జన్మంటూ వుంటే, హాయిగా మొగాడిలా పుట్టాలని దేముడికి దండం పెడుతున్నాను" అంటూ బయలుదేరింది వేద.

*